క్లుప్తంగా...

నేడు ధ్యాన, ఆధ్యాత్మిక సమ్మేళనం

సనత్‌నగర్: వసుదైన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుస్థాన్ ధ్యాన కేంద్రంలో ఈ నెల 28 (నేడు) సాయంత్రం 5 గంటలకు ధ్యాన, ఆధ్యాత్మిక సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగేంద్ర ఎస్ఆర్‌నగర్ పిరమిడ్ కేంద్రం వ్యవస్థాపకులు నీలం రవిశంకర్ తెలిపారు. ఆనందం, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగంగా ఈ కార్యక్రమాలపై వేసవి శిబిరాలను నిర్వహించామన్నారు. ఆదివారం జరిగే కార్యక్రమానికి నటుడు నవదీప్, ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్, కార్పొరేటర్, తదితరులు హాజరవుతారన్నారు.

గుర్తింపు కార్డుల అందజేత



గుర్తింపు కార్డులు అందజేస్తున్న నాయకులు

లాలాపేట: భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం లాలాపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి పాల్గొని పలువురి కార్మికులకు సభ్యత్వం గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఉమర్ ఖాన్, లతీఫ్, మల్లేష్ పాల్గొన్నారు.

బీఎస్పీలో ఓయూ విద్యార్థి నేతల చేరిక



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: బీఎస్పీలో పలువురు ఓయూ జేఏసీ నేతలు చేరారు. శనివారం బీఎస్పీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర నాయకులు సాంబశివగౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కంచర్ల బద్రి, జగన్, హరిప్రసాద్, విద్యాసాగర్, లింగం పార్టీలో చేరారు.

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు



చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న శ్రీ గణేష్

రసూల్‌పురా: ప్రతి ఏడాది జరిగే ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురా గన్‌బజార్‌లో హజ్రత్ షా గరీబ్‌షా దర్గా ఉర్సు ఉత్సవం, సిక్ విలేజ్ చౌరస్తాలో ఖాదర్‌వలీ దర్గా ఉర్సు ఉత్సవంలో శ్రీ గణేష్ ముఖ్య పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకతీతంగా ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు ప్రభాకర్‌తో కలిసి శ్రీ గణేష్ పాల్గొన్నారు. ఉర్సులో అబ్దుల్ ఖలీల్ భాయ్, రషీద్ భాయ్, నయీమ్, గౌతమ్, ఇస్మాయిల్, పవన్, సంతోష్, లికేష్, కిరణ్ పాల్గొన్నారు.

CAUTION NOTICE

"It is hereby informed to the public in general that Mrs. G. Urmila Devi D/o. P. Sridhar W/o. G. Krishna Moorthy Aged 54 years, R/o. Siddipet is suffering with psycological disorders and undergoing treatment for the same for the past 3 years. If she offers to sale or alienate in any manner in respect of any of movable or immovable properties got registered in her name without consent of other family members public in general are requested not to enter or perform any sort of transactions with her including credit some of amounts in her bank accounts without taking consent of other family members. If any person enters into any sort of agreement with Mrs. G. Urmila Devi without consent of other family members with or without knowledge about her incompetance shall be void and not binding on other family members such transactions shall be at their own risk they only are liable for loss or consequences thereof".

Under the instructions of P. Sridhar & Family and G. Krishna Moorthy And Family.

Mahesh Kumar Vemuganti, Ramani Vemuganti
Advocates
Plot No.10-20-49/1784, St.- 4, Vasavi Nagar, Gayathri Hills, Road No.2, Boduppal, Hyderabad-500092.
Cell: 9533558009

సంక్షేమ పథకాలకు ప్రజాదరణ

డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల కన్నా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రజల ఆదరణ పొందుతున్నాయని శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. శనివారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మారేడుపల్లి మండలం అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన పలువురు లబ్ధిదారులకు 58 జీఓ ద్వారా జారీ చేసిన ఇళ్లపట్టాలు, మాణికేశ్వరినగర్‌కు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ఫలాలను సికింద్రాబాద్ నియోజకవర్గ లబ్ధిదారులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. సీఎం సహాయనిధితో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర సంక్షేమ పథకాలను రికార్డు స్థాయిలో లష్కర్ ప్రజలకు అందించామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందుబాటులోకి తేవడం కోసం తమ కార్యాలయంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ నాయకులు బొగ్గుల కృష్ణ, అశ్విన్ కుమార్, మురళి, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక

సికింద్రాబాద్: తుకారాంగేట్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అంబటి ఆంజనేయులు శనివారం శాసన సభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, పాలకూర శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలపై పోరాటంలో పాల్గొంటా

ఎంపీ రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డిని కలిసిన ద.మ. రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు

అడ్డగుట్ట: రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో తానూ పాల్గొంటానని కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ఎంజీ. అరుణ్ కుమార్ నేతృత్వంలో ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు ఎంపీ రేవంత్‌రెడ్డిని కలిసి రైల్వే కార్మికుల సమస్యలను విన్నవించుకున్నారు. గతంలో రైల్వే విశ్రాంత ఉద్యోగులకు వర్తింపజేసిన పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేసే వరకు వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపడుతూనే ఉంటామన్నారు. పాత పెన్షన్ అమలు కోసం వచ్చే నెలలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మద్దతును కోరారు. అందుకు స్పందించిన ఆయన రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేసే ప్రతీ ఉద్యమంలో కాంగ్రెస్ తరుపున పాల్గొంటారన్నారు. ఎంపీని కలిసిన వారిలో బాబు నాయక్, ఆదం చంద్రశేఖర్, నరేష్, ఆదం సృజన్ కుమార్ ఉన్నారు.

లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్లను కేటాయించాలి



ఇళ్ల సముదాయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ ధోబీఘాట్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూమ్‌లను వెంటనే లబ్ధిదారులకు అందించాలని సికింద్రాబాద్ ప్రాంత సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ధోబీఘాట్‌లోని డబుల్ ఇళ్ల సముదాయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇక్కడ గృహ సముదాయం నిర్మించి మూడేళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. లబ్ధిదారులకు అద్దెల భారంతో ఇబ్బందులకు గురవుతున్నా నిర్మాణం పూర్తయిన గృహాలను ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి లబ్ధిదారులకు గృహాలను కేటాయించడంతో పాటు ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంపల్లి శ్రీనివాస్, బాబు, కుమార్, సోమయ్య, లతీఫ్, ఉమర్‌ఖాన్, రషీద్, యాదగిరి, సంపత్, ఖాసీం పాల్గొన్నారు.

కిమ్స్‌లో ఐబీడీ క్లినిక్ ప్రారంభం



ఐబీడీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్: భారతదేశంలో జీర్ణకోశ వ్యాధులకు సంబంధించిన ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్ (ఐబీడీ)లతో సుమారు 14 లక్షల మంది బాధపడుతున్నారని అలాంటి వారి కోసం ఒక స్పెషాలిటీ క్లినిక్‌ను అందుబాటులోకి తెచ్చామని ఆస్పత్రి సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. శనివారం ఈ క్లినిక్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఐబీడీ అనేది చిన్న, పెద్ద పేగులను ప్రభావితం చేసే దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిందని ఇందులో క్రాన్స్ సీజెస్, అల్సరేటివ్ కొలైటీస్ లాంటి పరిస్థితులు ఉంటాయన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ వ్యాధులు దేశంలో పెరిగిపోతున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా కొన్ని మిలియన్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారన్నారు.ఈ వ్యాధికి ప్రారంభ దశలోనే చికిత్స అందిస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. కమ్యూనిటీ ఔట్ రీచ్, ప్రచారాలు, పేషెంట్ అడ్వకసీ గ్రూపుల ద్వారా కచ్చితమైన సమాచారాన్ని వ్యాప్తి చేయడం ఐబీడీ గురించి అపోహలు తొలగించడం తమ ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ కే నందికూరి, ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ వినీత్ అహుజా కిమ్స్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక చర్యలు



అధికారులతో చర్చిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో సత్వరంగా అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేస్తున్నామన్నారు. శనివారం ఉత్తర మండలం జీహెచ్ఎంసీ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జలమండలి, విద్యుత్‌శాఖ అధికారులు తమకు సహకరిస్తూ వారి వారి అభివృద్ధి పనుల ప్రతిపాదనలు తమకు తెలుపాలన్నారు. తద్వారా రోడ్ల నిర్మాణాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. రహదారుల సమస్యల కారణంతో ట్రాఫిక్ జాం, బస్‌బేల నిర్మాణం కోసం సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ టీ.దశరథ్, జలమండలి డీజీఎంవై.కృష్ణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జెనటిక్స్ కౌన్సెలింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బేగంపేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనటిక్స్ డిసీజ్ సెంటర్‌లో కొనసాగుతున్న ఏడాది పీజీ డిప్లొమా ఇన్ జెనటిక్స్ కౌన్సెలింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎమ్మెస్సీ లైఫ్‌సైన్స్ కోర్సులతో పాటు ఎంబీబీఎస్, ఎండీ కోర్సులు పూర్తి చేసిన ప్రవేశానికి అర్హులని ఓయూ పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 5న జరిగే ప్రవేశ పరీక్షకు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 19 వరకు రూ.500 అపరాధ రుసుముతో 26 వరకు డౌన్‌లోడ్ చేసుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రతి శనివారం 'పీఓపీఎస్కే' పనిచేస్తాయి

రాంగోపాల్‌పేట్: పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్ కోసం దరఖాస్తుదారులు సుదీర్ఘ కాలం వేచి చూడకుండా ఉండేందుకు గత ప్రతి శనివారం తమ పరిధిలోని 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు పని చేస్తాయని పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రతి శనివారం పీఓపీఎస్కేలు పనిచేస్తున్నాయని తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వీటిని కొనసాగించాలని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ సూచించినట్లు తెలిపారు. శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 682 దరకాస్తులు పరిశీలించినట్లు తెలిపారు.

రూ.37 లక్షలతో రహదారి పనులు



బీదలబస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో ఇంటర్నల్ రహదారుల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ సామల హేమ చెప్పారు. శనివారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బీదలబస్తీ ప్రాంతంలో జరుగుతున్న రహదారి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ.. బీదలబస్తీలో రూ.37 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టామన్నారు. రహదారుల నిర్మాణం కన్నా ముందే డ్రైనేజీ, సీవరేజీ పనులు చేపడుతున్నామని డివిజన్ పరిధిలో తాగునీరు, మురుగునీరు, రహదారుల సమస్యలకు చెక్ పెడుతున్నామన్నారు. కార్పొరేటర్ వెంట ఏఈ కౌశిక్, బీదల బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విద్యాసాగర్, లక్ష్మి, సీతారాం ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం బాధ్యతగా భావించాలని నగర డిప్యూటీ ట్రాఫిక్ కమిషనర్ రాహుల్ హెగ్డే పేర్కొన్నారు. తిరుమలగిరి ట్రాఫిక్ పీఎస్ సీఐ పురుషోత్తం రావు ఆధ్వర్యంలో శనివారం బోయిన్‌పల్లి ఎయిర్‌ఫోర్స్ స్కూల్‌లో అధికారులు, సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలు, రోడ్‌సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పవర్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలపై వివరించారు. కొందరు వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళ్తూ వారితో పాటు ఇతరులను ప్రమాదాలకు గురిచేస్తున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ కెప్టెన్ మనీష్‌కుమార్, సుమన్, లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ చంద్ర, బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్లు సోలంకి, రాబర్ట్ పాల్గొన్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం పదిలం



యోగా మహోత్సవంలో పాల్గొన్న బండా కార్తీకరెడ్డి

లాలాపేట: క్రమం తప్పకుండా చేసే యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉందని బీజేపీ నాయకురాలు బండా కార్తీకరెడ్డి అన్నారు. జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పురస్కరించుకుని 25 రోజుల కౌంట్‌డౌన్‌గా శనివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన యోగా మహోత్సవ కార్యక్రమంలో కార్తీకరెడ్డి పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ వారసత్వ సంపద యోగా అని ప్రతి వ్యక్తి జీవితంలో దినచర్యగా మారాలన్నారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశంఅన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బండా చంద్రారెడ్డి, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్–ఫైర్ అధికారుల మధ్య భూ వివాదం

స్వల్ప ఉద్రిక్తత



గేటును మూసి గోడ నిర్మించిన దృశ్యం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎస్పీరోడ్ ప్యారడైజ్ ప్రాంతంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, అగ్ని మాపక శాఖ అధికారుల మధ్య భూమికి సంబంధించిన వివాదంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఉదయం 7 గంటలకు అగ్నిమాపక సిబ్బంది పోలీసు బందోబస్తు తమ సిబ్బందితో కలిసి వచ్చి అక్కడ ఉన్న గేటు ముందు గోడను నిర్మించడంతో స్కౌట్స్ అండ్ గైడ్స్, ఫైర్ సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ముందు భాగంలో రెండు ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. రెండు ఫైర్ స్టేషన్ల మధ్య భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఔట్ గేటు ఉంది. అయితే శనివారం ఉదయం వివిధ ఫైర్ స్టేషన్ల నుంచి సిబ్బందిని రప్పించిన అధికారులు ఔట్ గేటు స్థానంలో ఉన్న సామగ్రిని తొలగించి రోడ్డును మూసివేస్తూ గోడ నిర్మించేందుకు యత్నించారు. ఈ విషయం తెలిసిన స్కౌట్స్ ప్రతినిధులు అక్కడికి చేరుకుని పోలీసులు, ఫైర్ సిబ్బందితో గొడవకు దిగారు. ఈ స్థలం తమదంటే తమదని రెండు శాఖల అధికారులు గొడవ జరుగుతుండగానే ఫైర్ సిబ్బంది గేటును మూసి గోడను నిర్మించారు. అలాగే ప్రధాన రహదారి వైపు ఉండే మరో గేటును కూడా మూసివేస్తూ ఫైర్ సిబ్బంది గోడ నిర్మిస్తుండటంతో స్కౌట్స్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్కౌట్స్ కోశాధికారి రాజశేఖర్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు విజయభాస్కర్, కార్యదర్శి రమేష్ చంద్, అడ్మిన్ విభాగం ప్రతినిధి గౌరినాథ్ మాట్లాడుతూ.. భూ కబ్జాదారులు మాదిరిగా వందల మంది సిబ్బందిని తీసుకుని వచ్చి అక్రమంగా గోడ నిర్మాణం చేస్తున్నారని విమర్శించారు. 1930 సంవత్సరం నుంచి తమ సంస్థ కొనసాగుతుండగా 1970 దశకంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటైందని వాళ్లు ఇప్పుడు గేటు స్థలం తమదని కబ్జాకు పాల్పడటం సమంజసం కాదన్నారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మోహన్ రావు మాట్లాడుతూ.. స్కౌట్స్ అధికారులే తమ స్థలాన్ని కబ్జా చేయగా దాన్ని జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి తొలగించినట్లు వివరణ ఇచ్చారు.

నూతన సీఐని కలిసిన అడ్డగుట్ట ఫౌండర్స్ కమిటీ



సీఐని కలిసిన కమిటీ సభ్యులు

అడ్డగుట్ట: తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులును అడ్డగుట్ట ఫౌండర్స్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పెట్రోలింగ్ మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా అర్ధ రాత్రి సమయాల్లో బస్తీల్లో సంచరిస్తున్న అల్లరిమూకలపై కూడా చర్యలు తీసుకోవాలని సీఐని కోరారు. ఎస్. యాదగిరి, రమాదేవి, అమరావతి, ఎలమ్మ, అరుణ, లలిత, సునీత, సరిత, అనూష, పద్మ, శైలజ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: నాగర్‌కర్నూల్‌లో ఈ నెల 31న జరిగే గిరిజనుల అలయ్–బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వెంకట్ చౌహాన్ కోరారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట నాగర్‌కర్నూల్ బీఎస్పీ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను వెంకట్ చౌహాన్ ఆవిష్కరించి మాట్లాడారు. పోడు భూములకు పట్టాలిచ్చే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో పుట్టా శైలజ, చిరంజీవి, నాగన్న, బ్రహ్మయ్య, సుజాత, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం



అబ్దుల్ ఖదీర్

సికింద్రాబాద్: భార్యతో గొడవపడి ఆటో డ్రైవర్ అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ హరీశ్‌గౌడ్ కథనం ప్రకారం.. బౌద్ధనగర్‌కు చెందిన అబ్దుల్ ఖదీర్ (28) ఆటో డ్రైవర్. ఈ నెల 19న భార్య సుల్తానాబేగంతో గొడవ పడ్డాడు. అదేరోజు రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఖదీర్ ఎంతకీ రాలేదు. ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శనివారం భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యర్థాల తొలగింపు




జేసీబీతో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ఓపెన్ నాలాలోని వ్యర్థాలు తీసి రోడ్డు పక్కనే గుట్టలుగా పోసి వదిలేశారు. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులతో పాటు దుర్వాసన వచ్చేది. ఈ సమస్యపై 'తీసిన పూడిక రోడ్డుపైనే వదిలేస్తే ఏలా' అనే శీర్షికతో శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇంజినీరింగ్ ఏఈ వెంకటేష్ ఆధ్వర్యంలో వ్యర్థాలను జేసీబీతో తొలగించి శుభ్రపరిచారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..







సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379